తెలుగు దినపత్రిక
డైలీ రిపోర్ట్
DAILY REPORT

సంపుటి 1 సంచిక :16 7 ప్రచురణ: హైదారాబాద్ ఆదివారం 19-01-2025 వెల: 5/రూ.

# కొమురవెల్లి మల్లన్న జాతర ప్రారంభం

సిద్దిపేట జిల్లా, జనవరి 19 (డైలీ రిపోర్ట్):

కొమురవెల్లి మల్లన్న జాతర ఆదివారం ప్రారంభమైంది. సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర ఘనంగా ప్రారంభమైంది. రెండు నెలల పాటు ఈ జాతర జరగనుంది. సంక్రాంతి పండుగ తర్వాత మొదటి ఆదివారం కావడంతో మల్లికార్జున స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈరోజు ప్రారంభమైన జాతర ఉగాదికి ముందు వచ్చే ఆదివారం (మార్చి 23న) ముగియనుంది.ఈ ఆలయంలో ప్రతి ఆదివారం విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పిస్తారు. పట్నం వేసి స్వామి వారి కల్యాణం జరిపించి మొక్కు తీర్చుకుంటారు. తెలంగాణ, ఏపీతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేలాది భక్తులు తరలి వస్తారు.భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. రాజగోపురం పక్కన ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటిపై చలువ పందిళ్లు వేయించారు. కొత్తగా నిర్మించిన ప్రసాదాల విక్రయం, ఆర్జిత సేవల రసీదుల అందజేత కేంద్రం వద్ద పక్కా క్యూలైన్లు నిర్మించారు.







- సంక్రాంతి తర్వాత మొదటి ఆదివారం ప్రారంభం
- ఉగాదికి ముందు ఆదివారం ముగియనున్న జాతర
- స్వామి వారి దర్శనం కోసం తరలి వచ్చిన భక్తులు

ఈ జాతర వచ్చే ఆదివారం (మార్చి 23న) ముగియనుంది.

తెలుగు దినపత్రిక డైలీ రిపోర్ట్ DAILY REPORT
ఆదివారం: 19-01-2025

# రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామన్న కవిత
- రాజకీయ కోణంలోనే బీజేపీ ప్రకటన చేసిందన్న ఎమ్మెల్సీ
- ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని విమర్శ

హైదారాబాద్ బ్యూరో, జనవరి 19 (డైలీ రిపోర్ట్):

రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని, కానీ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును మాత్రం వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ... పసుపు బోర్డు ఏర్పాటుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిని రాజకీయ కోణంలోనే ప్రకటన చేశారన్నారు. నిజంగా రైతుల కోసమే ఈ నిర్ణయమైతే పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలన్నారు.ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారన్నారు. పసుపు బోర్డు కోసం బీఆర్ఎస్ పార్టీయే పోరాటం చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే పసుపు బోర్డు కోసం కృషి చేశానన్నారు. నిజామాబాద్‌కు విమానాశ్రయం తీసుకురావాల్సిన బాధ్యత ఎంపీ అర్వింద్‌పై ఉందన్నారు



తెలుగు దినపత్రిక డైలీ రిపోర్ట్ DAILY REPORT
ఆదివారం: 19-01-2025

# బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్

## ఇంట్లోకి జొరబడిన వ్యక్తిని బంగ్లాదేశీయుడిగా భావిస్తున్నట్లు ముంబై పోలీసులు వెల్లడి



- వివరాలు వెల్లడించిన ముంబై పోలీసులు
- బంగాదేశ్‌కు చెందిన మహమ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌గా గుర్తించినట్లు వెల్లడి
- తన పేరును బిజోయ్ దాస్‌గా మార్చుకున్నట్లు వెల్లడి
- నాలుగు నెలలుగా ముంబైలో నివసిస్తున్నాడన్న పోలీస్ అధికారి
- ఫైర్ ఎగ్జిట్ ద్వారా సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి జొరబడినట్లు వెల్లడి

### ఫైర్ ఎగ్జిట్ ద్వారా లోనికి వచ్చాడు

అతను ఫైర్ ఎగ్జిట్ ద్వారా ఇంట్లోకి వచ్చినట్లు చెప్పారు. ఇంట్లోని పనిమనిషి గమనించి కేకలు వేసిందన్నారు. సైఫ్ అలీఖాన్ అతనిని అడ్డుకునే ప్రయత్నం చేశాడని, దీంతో ఆ వ్యక్తి ఆరుసార్లు సైఫ్ అలీఖాన్ ను పొడిచి పారిపోయాడన్నారు. సైఫ్‌ను సమీపంలోని లీలావతి ఆసుపత్రికి తరలించారని, అతను క్రమంగా కోలుకుంటున్నాడన్నారు.

మహమ్మద్ షరీఫుల్ ఇస్లాం డబ్బు డిమాండ్ చేశాడని, వారు ఇవ్వమని చెప్పడంతో పాటు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో దాడి చేసినట్లు చెప్పారు. సాంకేతిక ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించినందుకు కూడా అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ముంబై , (డైలీ రిపోర్ట్) , జనవరి 19:

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి జొరబడిన వ్యక్తిని బంగ్లాదేశీయుడిగా భావిస్తున్నట్లు ముంబై పోలీసులు తెలిపారు. అతను గత కొన్ని నెలలుగా ముంబైలోనే నివసిస్తున్నాడని వెల్లడించారు. ఈరోజు ముంబై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దీక్షిత్ మీడియాతో మాట్లాడుతూ... మూడు రోజుల క్రితం సైఫ్ అలీఖాన్ ఇంట్లో జొరబడిన వ్యక్తిని చోరీ కేసులో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితుడిని మహమ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌గా గుర్తించినట్లు తెలిపారు.దర్యాప్తు ఆధారంగా అతను బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. అతని వద్ద భారతీయుడిగా గుర్తించేందుకు ఎలాంటి ఆధారాలు లేదా పత్రాలు లేవన్నారు. బంగ్లాదేశ్‌కు చెందినవాడిగానే అనుమానిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అతనిపై పాస్‌పోర్ట్ యాక్ట్ అభియోగాల కింద కూడా కేసు నమోదు చేశామన్నారు.నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువుల ఆధారంగా అతను బంగ్లాదేశ్‌కు చెందినవాడిగా కనిపిస్తోందన్నారు. అతను దేశంలోకి అక్రమంగా వచ్చాడని, తన పేరును బిజోయ్ దాస్‌గా మార్చుకున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గత నాలుగు నెలలుగా అతను ముంబైలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. ముంబైకి వచ్చాక అతను హౌస్ కీపింగ్ ఏజెన్సీలో పని చేస్తున్నాడన్నారు. నిందితుడిని థానేలో అరెస్ట్ చేశామని, అతన్ని ఇంకా ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు.